# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రైతులకు అధిక ఆదాయం లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**
2. **మచిలీపట్నం పోర్ట్ ను పూర్తి చేసి, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**
3. **రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **ప్రపంచ మలేరియా నివారణా దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ... రైతులకు అధిక ఆదాయం లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గుంటూరు జిల్లా, ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా ఆవిష్కరించేందుకు క్లస్టర్ల వారీగా కార్యాచరణ చేపట్టాలన్నారు. 'కోకో సిటీ'ని 250 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అరకు ఏజెన్సీలో కుంకుమ పువ్వు సాగును మరింత విస్తరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మష్రూమ్ మిషన్ కింద ఏడాదికి లక్ష టన్నుల మేర దిగుబడులు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. అనంతపురంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఆపిల్ సాగును పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మొత్తం 50 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

--------------------------

మచిలీపట్నం పోర్ట్‌ను పూర్తి చేసి, ఈ ప్రాంతాన్ని ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీటప్నం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పలు మౌలిక సదుపాయాలను చేపడుతున్నట్లు తెలిపారు. మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బర్ లో భాగంగా ప్రజల నుంచి అర్జీలను ఆయన నిన్న స్వీకరించారు. ఈ సంధర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా పోలాటితిప్ప--గరాలదిబ్బ రహదారి, నడమేరు--కొండేరు బ్రిడ్జి నిర్మాణానికి 18 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

---------------------------

మహిళల అక్రమ రవాణా ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. మహిళల రక్షణపై విజయవాడలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ హాల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై హైదరాబాద్‌లో పౌర సరఫరాల శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు కాలేదని ఆయన పేర్కొన్నారు. ఈ రబీ సీజన్ లో 90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

---------------------------

ప్రపంచ మలేరియా నివారణా దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. మలేరియా వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన కల్పించి... ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించే ఉద్దేశ్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ..... డబ్ల్యూ.హెచ్.ఒ. ... పిలుపు మేరకు 2008వ సంవత్సరం నుండి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆఫ్రికాలోని నైజీరియా దేశ రాజధాని అబూజాలో 2001 ఏప్రిల్ 25వ తేదీన ఆఫ్రికన్ యూనియన్ దేశాలు సమావేశమై... ఆరోగ్య రంగాన్ని మెరుగుపరిచేందుకు తమ వార్షిక బడ్జెట్లో కనీసం 15 శాతం మొత్తాన్ని కేటాయించాలని తీర్మానించాయి. ఏప్రిల్ 25 న జరిగిన ఆ తీర్మానాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ప్రచార, అవగాహన వాల్‌పోస్టర్లు, కరపత్రాల్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి.వీరపాండియన్ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆ శాఖ కార్యాలయంలో ఆయన నిన్న ఆవిష్కరించారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద రాష్ట్రంలో మలేరియా నిర్మూలనకు సంబంధించి తీసుకున్న చర్యల గురించి వివరించారు. మలేరియాపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. "మలేరియా నిర్మూలన దిశగా.., ఇప్పుడు సాధించగలం, ఇప్పుడు తప్పనిసరిగా సాధించాలి" అనే నినాదంతో ఈరోజు మలేరియా దినాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎంతో కీలకమైనదని శ్రీకాకుళం జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యలయంలో

నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవంలో నిన్న మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పంచాయతీ రాజ్ శాఖలో పని చేస్తున్న అనేక మంది ఉద్యోగులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించినట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 133వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా మంగళగిరిలో రెండు రోజుల పాటు ఫ్యాన్ పార్క్‌ను నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారీ స్క్రీన్ పై ఈ రోజు ఢిల్లీ – పంజాబ్, రాజస్థాన్ – హైదరాబాద్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లు ప్రదర్శించబడతాయని, రేపు గుజరాత్ – చెన్నై, లఖ్‌నవూ – కోల్‌కతా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లు ప్రసారం చేయబడతాయని వెల్లడించారు. స్టేడియంలో ప్రత్యక్షంగా చూస్తే కలిగే అనుభూతిని కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొంటూ..

వాయిస్..27 సెకన్లు

---------------------------

తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ జేఏసీల మధ్య జరిగిన చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. ఈ ఉదయం మొదటి షిఫ్ట్ నుంచి ఆర్టీసీ బస్సులు యదావిధిగా నడపనున్నారని అధికారులు వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాదులోని సచివాలయంలో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలతో మంత్రుల బృందం నిన్న సమావేశం అయింది. ఈ సమావేశంలో ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లపై ప్రధానంగా చర్చలు జరగ్గా.. 11 శాతం పీఆర్సీ, ప్రభుత్వంలో విలీనం, ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ రోజు 14 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 28 మండలాల్లో ఒక మోస్తరు స్థాయిలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొన్నారు. తీవ్ర వడగాల్పులు శ్రీకాకుళం జిల్లాలోని హిరమండలం, బలిజిపేట, పాతపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలోని గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతంపేట, సీతానగరం మండలాలు ఉన్నాయి. ప్రజలు ఎండ, వడగాలులు, ఉక్కపోత వంటి పరిస్థితులలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే 2 రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీలు వరకూ పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

======================